క్లుప్తంగా

బోరుమోటారు ప్రారంభం



బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష సహకారంతో అందోల్ మండలంలోని కొడేకల్ గ్రామ ఎస్సీ కాలనీలో నూతనంగా బోరు మోటార్ సౌకర్యం కల్పించారు. గురువారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బోరు మోటారును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కె.రాజేశ్వర్‌గౌడ్, జి. శ్రీనివాస్‌రెడ్డి, ఎలిషా, గ్రామ అధ్యక్షుడు పి.వీరారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైపాల్ రెడ్డి, వీరేశం, సుధాకర్ కుమార్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. నీటి సౌకర్యం కల్పించడంపై గ్రామస్తులు త్రిషకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఖేడ్‌లో స్వచ్ఛతా హీ సేవ



నారాయణఖేడ్: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అమ్మపేరిట ఒక మొక్క నినాదంతో విద్యార్థులు మొక్కలు నాటారు. తహసీల్ గ్రౌండ్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇళ్లవద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటోల్లో వేయాలని, ప్లాస్టిక్ రహిత బ్యాగులు వాడాలని కమిషనరు జగ్జీవన్ అవగాహన కల్పించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బంది మహేష్, రాజు, క్రాంతి, దేవదాస్, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

జోగిపేటలో..

జోగిపేట(అందోల్): అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మిక సిబ్బంది అందోలు చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు, పూలు, ఇతర వస్తువులను నీటిలో నుంచి తొలగించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం ఆవరణలో గురువారం మండలస్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఖేడ్ గురుకులానికి చెందిన పలువురు విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీల్లో ప్రథమ బహుమతులను సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలోని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో గురువారం మృత్యుంజయ హోమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం చేశారు. శ్రీశైల మహాక్షేత్ర ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, నాగరాజ్ శాస్త్రి హాజరై హోమం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణ మధ్య దత్తహోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో మాతశ్రీ అనసూయ మాత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుభాష్, కేతకి ఆలయ మాజీ చైర్మన్ ఎస్ వెంకటేశం, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం ఉత్తులూరు గ్రామానికి చెందిన సాయిలుకు రూ.18 వేలు, సావిత్రికి రూ.13,500 సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. గురువారం ఖేడ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యులు నగేశ్ షెట్కార్, పీసీసీ సభ్యుడు కర్నెశ్రీనివాస్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

మార్పులు, చేర్పులుంటే చెప్పండి

అఖిలపక్ష సమావేశం



కల్హేర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఓ శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): ఓటరు జాబితా సవరణపై కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో గురువారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్హార్, ఎంపీఓ శ్రీనివాస్,మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

నారాయణఖేడ్: ఓటరు నమోదుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఖేడ్ ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు నమోదుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు సంబంధించి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటర్లుగా నమోదు చేయించుకోవడానికి పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు.



నారాయణఖేడ్: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

పోలింగ్ శాతాన్ని పెంచాలి

సంగారెడ్డి టౌన్ : రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఓటర్ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ ఐడిలో ఏమైనా మార్పులు ఉన్నా సరి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల మండల అధ్యక్షుడు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): వార్డుల వారీగా ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఆయా రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఎంపీడీఓ హరినందరావు సమావేశం నిర్వహించారు. వార్డుల వారీ జాబితాను ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, సీపీఎం పార్టీ నాయకులు రమేశ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సూచనలు, సలహాలు స్వీకరణ

జోగిపేట(అందోల్): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఆయా పార్టీల అధ్యక్షులతో ఓటరు జాబితా డ్రాఫ్ట్‌కి సంబంధించి ఎంపీడీఓ రాజేష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు వారీగా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో వచ్చేలా చూసుకోవాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శివచందర్‌లతో పాటు ఎంపీఓ అశోక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

రాయికోడ్(అందోల్): మండలంలోని గ్రామ పంచాయతీల్లోని నోటీస్ బోర్డులపై అతికించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. రాయికోడ్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల వారీగా సిద్ధం చేసిన ఓటరు జాబితాలో తమ సొంత వార్డు కాకుండా ఇతర వార్డుల్లో నమోదై ఉన్న ఓటర్ల వివరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ నెల 21లోపు అభ్యంతరాలు తెలపాలన్నారు. ఉన్నతాధికారులకు నివేదించిన తర్వాత ఓటరు జాబితాను సవరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీఓ అంజలీదేవి, నాయకులు సిహెచ్.విఠల్, దశరథ్, నర్సింగ్‌రావు, హన్మన్న పాటిల్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్

మోడల్ స్కూల్ అభివృద్ధికి నిధులు

రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): మోడల్ స్కూల్ అభివృద్ధికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ రూ.4 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరుస్తున్నారని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మునిపల్లి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సౌకర్యంతో పాటు నాణ్యమైన తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మోడల్ స్కూల్ అభివృద్ధి, విద్యాభివృద్ధిలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ అఖిలకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, ఎంపీడీఏ హరినందన్‌రావు, ఎంఈఓ దశరథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి బీబీఏ-1, హిస్టరీ-1 అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు బీబీఏ, ఎంబీఏ, హిస్టరీకి సంబంధిత సబ్జెక్టులో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. నెట్‌సెట్ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. సెప్టెంబర్ 21న సమయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు పటాన్ చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత పత్రాలతో హాజరు కావాలన్నారు.

రైతు హక్కుల సాధన సమితి ఏర్పాటు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల రైతు హక్కుల సాధన సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని హద్నూర్ గ్రామంలో గురువారం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా గంజాయి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సురేందర్, ప్రధాన కార్యదర్శిగా గుండారెడ్డి, కార్యదర్శిగా ఎం.రాహుల్, కోశాధికారిగా ఎ.సామెల్, కమిటీ సభ్యుడిగా మస్తాన్ సాబ్, రహీమోద్దీన్, వలీ, అంజన్న, జయ్‌రాజ్, వినోద్‌కుమార్, రవీందర్, నాగన్న, మల్లన్న తదితరులు ఎన్నికయ్యారు.

కనీస పెన్షన్ రూ.5 వేలకు పెంచాలి



ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు, కార్మికులు

పటాన్‌చెరు టౌన్: ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కార్మికులు రిటైర్మెంట్ అయిన తర్వాత ఎలాంటి ఆధారం లేకుండా బతుకు వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1995లో ఏర్పాటు చేసిన ఈపీఎఫ్ పెన్షన్ స్కీంలో కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. వేయి రూపాయాల పెన్షన్‌తో కార్మికులు వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలు ఉద్యోగం చేస్తే ఎలాంటి ఆసరా ఉండట్లేదని, అదే రాజకీయ నాయకులు ఒక్కసారి గెలిస్తే జీవితాంతం లక్షల్లో పెన్షన్ వస్తుందని ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత పెన్షన్లు కూడా రూ.4 వేలు దాటాయని అన్నారు. కాని, కార్మికులకు వెయ్యి రూపాయాలు దాటలేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.5 వేలు పెంచి డీఏ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అధిక పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, అంజయ్య, జగదాస్, జిల్లా ఉపాధ్యకుడు ఆదినారాయణ, విజయ్, కార్మికులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌ను అడ్డుకున్న రైతులు

సమస్యలు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం



జూనియర్ లైన్‌మెన్‌ను అడ్డుకున్న రైతులు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలు పట్టించుకోవడంలేదంటూ గురువారం జూనియర్ లైన్‌మెన్‌ను రైతులు అడ్డుకున్నారు. వారం రోజుల క్రితం బోరుబావుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో జోగిపేటకు తీసుకెళ్లి రిపేరు చేయించి ఎల్‌సీ తీసుకొని బిగించిన మరునాడే మళ్లీ కాలిపోయిందన్నారు. దీంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా లైన్‌మెన్ వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువెళ్లి రిపేరు చేయించి, బిగించినప్పటికీ కరెంట్ కనెక్షన్ మరునాడు ఇస్తానని చెప్పి, మరుసటిరోజు కనెక్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. లైన్‌మైన్ ఫోన్‌చేసి అడగ్గా ఏఈకి ఫోన్ చేసుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుతున్నాడని అన్నారు. గురువారం విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి వచ్చిన లైన్‌మెన్‌పై రైతులు అడ్డుకొని ఏఈ వచ్చే వరకు కనెక్షన్ ఇవ్వద్దంటూ ఆపారు. దీంతో ఏఈ శ్రీనివాస్ రైతులతో ఫోన్‌లో మాట్లాడి వారికి నచ్చజెప్పి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా మండలంలో లైన్‌మెన్ల కొరత ఉందని ఒక్కొక్కరు నాలుగైదు గ్రామాల్లో విధులు నిర్వహించాల్సి వస్తుంది. దీంతో వర్క్‌లోడ్ కారణంగా పనుల నిర్వహణలో కొంత ఆలస్యం అవుతుందన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం..

డీఎస్పీ రవీందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని డాక్టర్ అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంవీకే(మంజీరా విద్యాలయ కేంద్రం) ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన డ్రగ్స్ వ్యతిరేక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. డ్రగ్స్ సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని చెప్పారు. డ్రగ్స్‌కొన్న అమ్మిన చట్టరీత్యా నేరమని, ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రభుత్వం కూడా డ్రగ్స్ రహిత సమాజ కోసం కృషి చేస్తోందని వివరించారు. ఈ సదస్సులో ఎంవీకే ఫౌండర్ సభ్యులు రాజయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. డ్రగ్స్‌ను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెడువారితో స్నేహం మంచికాదని, డ్రగ్స్‌ను అరికట్టే బాధ్యత తల్లిదండ్రులు, ప్రభుత్వం, పోలీసులు, సామాజిక సంస్థలపైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అంబార్యానాయక్, సభ్యులు బాసిత్, సుదర్శన్ రెడ్డి, ఇమ్మానియేల్ బాబు సురేశ్, కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండగ సాయన్న స్ఫూర్తితో ముందుకు..



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

పటాన్ చెరు: పండగసాయన్న స్ఫూర్తితో ముదిరాజ్‌లంతా రాజకీయంగా ఎదగాలని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. వచ్చే నెల 21న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పండగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం, ఎన్టీఆర్ స్టేడియంలో 25 వేల మందితో ముదిరాజ్ సింహ గర్జన సభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని నీలం మధును మహబూబాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ సాయన్న స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో ఈ విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నీలం మధు ముందుండి నడిపించడంతో పాటు ముదిరాజ్‌ల రాజకీయ ఐక్యత కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సాయన్న జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మొదలైన పండగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీలం దుర్గేశ్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, భాస్కర్‌పాల్గొన్నారు.

క్రీడాపాలసీకి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్ : క్రీడాపాలసీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఎండీ ఆదేశాల మేరకు క్రీడాపాలసీ రూపొందించిందన్నారు. 2019 నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు తమ వివరాలను కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడాకార్యాలయంలో 24వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు

బాధిత కుటుంబానికి పరామర్శ

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను గురువారం జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ పరామర్శించారు. మండల పరిధిలోని కక్కర్వాడ గ్రామంలోని బాధిత ఇంటికి వెళ్లి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఉదయ్ శంకర్ పాటిల్, నరేశ్‌గౌడ్, నరేశ్‌కుమార్, గోపాల్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు**



నారాయణఖేడ్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపుమేరకు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు రవీందర్‌నాయక్, మండల రైబస మాజీ అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, ముఖ్యనాయకులు గంగారాం, ప్రభాకర్, శ్రీకాంత్, జగతిరాజు, బాసిత్, అమ్ర్యానాయక్, రాజునాయక్ తదితరులు అరెస్టయినవారిలో ఉన్నారు. మధ్యాహ్నం వారిని సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

◆ **రామచంద్రాపురంలో..**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాభవన్ ముట్టడిలో భాగంగా గురువారం రామచంద్రాపురం పట్టణం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామచంద్రాపురం పట్టణంలో సీనియర్ నాయకులు వైన్నవరం ఆదర్శ్ రెడ్డి, కృష్ణకాంత్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కౌన్సిలర్ లచ్చిరాం, నాయకులు ఉమేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

◆ **విద్యాభివృద్ధికి కృషి**

మునిపల్లి(అందోల్): విద్యాభివృద్ధికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం మునిపల్లి మోడల్ స్కూల్‌లో బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి సన్మానించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో తెలంగాణలోనే మునిపల్లి మోడల్ స్కూల్ రెండవ స్థానంలో ఉందన్నారు. 710 మంది విద్యార్థులున్నారని తెలిపారు. విద్యార్థులు విద్యాభివృద్ధి చెందడానికి మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఉపాధ్యాయుల కొరత లేకుండా, విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, మల్లిక, ఎంపీడీఓ హరినందన్‌రావు, ఎంఈఓ దశరథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, సీపీఎం పార్టీ నాయకులు రమేశ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **నల్లబ్యాడ్జీలతో నిరసన**

జహీరాబాద్: గురుకుల పాఠశాలలో ఒకే పని వేళలను నిర్ణయిస్తూ ప్రభుత్వం జీఓ నం.16ను నిరసిస్తూ యూటీఎఫ్ గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. గురువారం మండలంలోని బూచనెల్లి గ్రామంలో గల మైనార్టీ బాలికల గురుకుల క్యాంపస్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రమేష్‌కుమార్, ఎం.శ్యామ్ పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు.

◆ **అక్రమంగా ఎర్రరౌతు తరలింపు**

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని పర్వతాపూర్ నుంచి అక్రమంగా ఎర్రరౌతు తరలిస్తున్న వాహనానికి జరిమానా విధించారు. గురువారం రెవెన్యూ అధికారులు గనికి వెళ్లగా వాహనంలో కొంత ఎర్రరౌతు తరలిస్తుండగా పట్టుకుని రూ.2వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

◆ **గుర్తు తెలియని మృతదేహం లభ్యం**

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలంలోని గండిగూడెం గ్రామ సర్వీస్ రోడ్డు ప్రక్కన గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీసులను సంప్రదించాలన్నారు. దయ్యారా గ్రామపంచాయతీ కార్యదర్శి శివకాంతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **సంగారెడ్డిలో ముస్లింల ర్యాలీ**

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని నాల్‌సాబ్ గడ్డ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

◆ **గాయపడిన యువకుడికి పరామర్శ**

జహీరాబాద్: వినాయక ఉత్సవాల్లో గాయపడిన యువకుడిని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి పరామర్శించారు. గురువారం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఇంగోలి దశరథ్ ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చేతి వేళ్లు నలిగిపోయినట్లు , తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు. ప్రైవేటు కర్మాగారంలో ఉద్యోగం ఇప్పించడంతో పాటు వైద్యం ఖర్చులను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాములు నేత, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహాయాదవ్, మల్లేష్ యాదవ్, నగేష్, మధుసూదన్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

◆ **ప్రత్యేక పూజలు**

మునిపల్లి(అందోల్): వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని మండపాల్లో వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేయగా, మరి కొందరు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

◆ **ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక**

నారాయణఖేడ్: ఖేడ్ మండల అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నూతన కమిటీని ఖేడ్‌లో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రోహిత్, కార్యదర్శిగా నిఖిల్ ఎన్నికయ్యారు. మండలంలో విద్యారంగానికి సంబంధించిన సమస్యలు, పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ తమ వంతు కృషి చేస్తామని ఎన్నికైన సభ్యులు తెలిపారు. సంఘం జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి, జిల్లా, స్థానిక నాయకులు అశోక్, సునీల్, అరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.